# అనగనగా ఒక కథ

# అయినా... అంతమవలేదు!

బ్నిం

''బాబుగారు ఏమన్నారూ?''

''బాబుగారూ కాదు బావగారూ అనవయ్యా... మా అమ్మాయిని మీ అబ్బాయికిచ్చి పెళ్ళి చేద్దామని అడగడానికొచ్చినప్పుడు ఈ మొహమాటాలెందుకు, గౌరవాలెందుకు..''

★ ★ ★

''ఏంట్రా అది చౌదరిగారి అమ్మాయిని నువ్వు ప్రేమించావా? మనంతస్థేంటో, వాళ్ళ అంతస్థేంటో తెలుసుకునే ఇంతపని చేశావా?''

''నాకుగా నేను ప్రేమిస్తున్నానని చెప్పలేదు నాన్నా. తనే వచ్చి పదే పదే చెప్పేది. మొదట్లో భయపడ్డాను. చెప్పగా చెప్పగా మనసు పడ్డాను. ఎన్ని విధాలో చెప్పి చూశాను, నా నోరు మూసింది. ప్రేమందీ.. పెళ్ళందీ..''

కొడుకు జవాబు విని కొయ్యబారిపోయాడు కోటయ్య.

''పెద్దవాళ్ళతో పెట్టుకోకూడదురా'' కోటయ్య కంగారు కోటయ్యది.

''నిజం నాన్నా పెద్దవాళ్ళతో బంధంకన్నా వాళ్ళ కోపం మరీ ప్రమాదం. నేనొకవేళ గట్టిగా వ్యతిరేకిస్తే కృష్ణ నామీద అఘాయిత్యం చేశాడని రివర్సవుతుంది. నేనందుకే మీ నాన్నని, మా నాన్నతో మాట్లాడమని తప్పించుకున్నాను. ఆ పిల్ల ఇది సాధించగలదనుకోలేదు'' అన్నాడు కృష్ణ.

★ ★ ★

''మీరు కోటయ్యింటికెళ్ళారా?'' కోపంగా అడిగింది కనకరత్నం.

''అవును''

''నాతో ముందుగా ఎందుకు చెప్పలేదూ?''

''నీతో ఆలోచించాలా..? నీకు చెప్పాలా?''

''నా కూతురు జీవితం విషయంలో నాకు చెప్పమని అడగడంలో తప్పుందంటారా..?''

చౌదరి కోపం నషాలాన్నంటింది. ఇంకొకప్పుడైనా అయితే చెంపదెబ్బ వేసేవాడేమో గానీ ఎందుకో కంట్రోల్ చేసుకున్నాడు.

''కోటయ్యనిగానీ కోటయ్య కొడుకునిగానీ మన వరండా దాటి లోపలికి రానిచ్చే వాళ్ళం కాదు. వాడు పాలు పితికితే ఇంత



పసుపు జల్లి తీసుకునేవాళ్ళం. వాడికేదయినా పెట్టదల్చుకుంటే పశువులకొట్టంలో విస్తరేసి వడ్డించేవాళ్ళం. అలాటివాణ్ణి వియ్యంకుడుగా మీరెలా ఒప్పుకున్నారని నా ప్రశ్న. కానీ.. నేనడగను'' అంటూ ఏడుస్తూ వెళ్ళిపోయింది కనకరత్నం.

చౌదరి ఒక నవ్వు నవ్వుకున్నాడు. ''మహితా..!'' అంటూ కూతుర్ని పిల్చి.. ''కృష్ణతో నీ పెళ్ళి సెటిల్ చేస్తున్నాను. ఎల్లుండే తాంబూలాలు''

మహిత నమ్మలేకపోయింది. లేచిపోడానికి బేగులు సర్దుకుంటున్న మహితకి ఈ మాట వేసవిలో వెన్నెలవాన.

కళ్ళనీళ్ళు తిరిగాయ్.

ఊహల్లో.. కలల్లో ఉన్న జీవితాన్ని చేతికందినంత ఆనందంతో ఉక్కిరిబిక్కిరై, నాన్న కాళ్ళమీద పడిపోయింది. కన్నీటితో పాదాలు కడిగింది.

''నాన్నా.. కృష్ణ.. కృష్ణని మీరు యాక్సెప్ట్ చేశారా?''

''నీ కోసమే కాదు.. నాకోసం కూడా''

★ ★ ★

చౌదరి తక్కువవాడేం కాదు! ఇన్నాళ్ళుగా వెలికట్టిన కుటుంబాన్ని బంధువుల్ని చేసుకోవడానికి అతనే పిచ్చివాడు కాదు. ఆ కాన్ స్టెన్సీ దళితుల కోటాలోకెళ్ళిపోయిందట. తన అధికారం చేజారిపోకుండా ఒక దళితుడి చేతిలో పెట్టాలంటే, ఆ దళితుడు తన అల్లుడే అయితే తన యాజమాన్యమే నడుస్తుంది. కూతురు ప్రేమించి తప్పులో కాలేసినందుకు ఓ పరిష్కారమూ దొరుకుతుంది. కాబోయే అల్లుణ్ణి ఇంటికి పిలిచాడు చౌదరి. కృష్ణ వణికిపోతూ కూర్చున్నాడు.

''ఎలక్షన్లో పోటీ చేయడానికి నీ పేరు నమోదు చెయ్యాలి. నువ్వు హీరోవైతే నేను హీరో మేకర్ని. నీక్కావలసిన డబ్బులు నేను పెడతాను. నా అల్లుడు హోదాలో ఈ ఎలక్షన్లో గెలిస్తే...'' అని నిశ్చయ తాంబూలాలయిన రోజు కృష్ణతో చెప్పాడు చౌదరి.

''అదికాదు మావయ్యగారూ.. నాకు ఎలక్షన్లలో నిలబడ్డమే ఇష్టంలేదు. పెళ్ళి చేసుకున్నాక మేమిద్దరం ఏదో చిన్న ఉద్యోగాలు చూసుకుని బతుకుదాం అనుకున్నాం''

పేలిన అగ్ని పర్వతం అయిపోయాడు చౌదరి.

''బంగారం సింహాసనం మీద కుక్కను కూర్చోపెట్టకూడదని వేమన ఎప్పుడో చెప్పాడులే. తక్షణం బయటికెళ్ళు. నా ఇంట్లోకి రావటానికి ఎన్ని గుండెలురా నీకు'' అన్నాడు చౌదరి.

లోపల్నించి చూస్తున్న మహిత కంగారుతో వణికిపోయింది. కథ మొదటికొచ్చిందని భయపడింది.

★ ★ ★

అందరి ముందు ఇతడు నా అల్లుడని భారీ యెత్తులో నిశ్చయతాంబూలాలు చేసిన చౌదరిలో అమానుషత్వం వెల్లివిరిసింది. ఫలితంగా ఆ ముహూర్తమే అతని అనుమానానికి పెట్టిన ముహూర్తమయింది.

కోటయ్య ఈ దారుణాన్ని తట్టుకోలేక ఇంట్లో ఫేనునే ఉరికంబంగా చేసుకుని ఊరేగాడు.

రోజులు మారుతున్నాయ్.. సంవత్సరాలు మారుతున్నాయి. ముహూర్తాలు, తిథులు కూడా మారుతున్నాయి. మారనివాడు చౌదరి మాత్రమే.

వాళ్ళమ్మాయి కృష్ణని పెళ్ళి చేసుకుని ఎక్కడో అజ్ఞాతంగా సుఖసంతోషాలతోనే ఉంది.

రాజకీయంతో డబ్బుమదంతో ఒక జీవిని బలితీసుకున్నా, మరో రెండు జీవితాలని విడగొట్టలేకపోయాడు.

ఇప్పుడు కూతురు, అల్లుడు ఎక్కడున్నారో చౌదరికి తెలీదు. తెలిస్తే ఇంకేమైనా ఉందా??

వాళ్ళ గురించి మనమూ చెప్పొద్దు.

☆

## నగ్మాకి పోటీ!

**ముంబాయి భామ నగ్మా ఒకప్పుడు తెలుగులో టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. తెలుగు అమ్మాయి అయిన రంభ కూడా తెలుగులో అగ్రశ్రేణి హీరోలతో నటించి క్రేజీ హీరోయిన్‌గా నిలిచింది. ప్రస్తుతం రంభ స్టార్ రేస్‌లో వెనకబడినా తెలుగులో ఇంకా హీరోయిన్‌గానూ, ఐటమ్‌గాళ్‌గానూ నటిస్తూనే వుంది. నగ్మా, రంభ ఇద్దరూ ఇప్పుడు భోజ్‌పురి సినిమాల్లో బిజీగా వున్నారు. భోజ్‌పురిలోకి ముందుగా నగ్మా ప్రవేశించి తనదైన క్రేజ్ తెచ్చుకుంది. తర్వాత రంభ కూడా అరంగేట్రం చేసి అక్కడ బిజీ స్టార్ అయింది. భోజ్‌పురి సినిమాల్లో నగ్మా-రంభల మధ్య పోటీ నడుస్తోందనేది సినీ వర్గాల టాక్. ఏదయితేనేం భోజ్‌పురి ప్రేక్షకులు మాత్రం కనువిందైన గ్లామర్‌ని ఆస్వాదిస్తున్నారట.**

